# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-04-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ప్రభుత్వం అందిస్తున్న అన్ని సేవలు ఈ ఏడాది చివరినాటికల్లా ఆన్‌లైన్‌లో లభించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

**2)** **తెలంగాణలో తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించే బ్యారేజీ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు .**

**3)** **ఆంధ్రప్రదేశ్‌లో పదో తరగతి పరీక్షా ఫలితాలను విద్యాశాఖమంత్రి నారా లోకేష్ ఈరోజు విడుదల చేస్తారు.**

**4)** **గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత, ఆరోగ్యకరమైన పద్ధతులను ప్రోత్సహించేందుకు స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని ప్రారంభించామని ఆంధ్రప్రదేశ్ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.**

=========================

ప్రభుత్వం అందిస్తున్న అన్ని సేవలు ఈ ఏడాది చివరినాటికల్లా ఆన్‌లైన్‌లో లభించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వాట్సప్ గవర్నెన్స్, మన మిత్ర పరిధిలోకి అన్ని సేవలు తీసుకు వస్తే ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పని ఉండదని ఆయన చెప్పారు. ఆర్టీజీఎస్‌పై వివిధ శాఖల ఉన్నతాధికారులతో గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. మనమిత్ర వాట్సప్ గవర్నెన్సు ద్వారా ప్రస్తుతం 1 వెయ్యి 35 సేవలు అందిస్తున్నామని, ప్రభుత్వ సేవలన్నింటినీ వాట్సాప్ గవర్నెన్స్ పరిధిలోనికి తీసుకురావడం వల్ల ప్రజలకు ఇబ్బందులు లేని పాలనను అందించవచ్చున్నారు.

-------------------------

ఈ ఏడాది రాష్ట్రంలో 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఉన్నామని ఆంధ్రప్రదేశ్ చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. రాష్ట్రంలో డ్వాక్రా మహిళల జీవనోపాధి కోసం కేంద్ర ప్రభుత్వం 207 కోట్ల రూపాయలు విడుదల చేసింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ .... ఈ నిధులతో గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం 'సెర్ప్– ద్వారా ...దీన్ దయాళ్ అంత్యోదయ యోజన – జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ అమలు చేస్తామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కింద స్వయం సహాయక సంఘాలకు మొత్తం 690 కోట్ల రూపాయలు అందుబాటులోకి రానున్నాయి. ఇందులో మొదటివిడతగా కేంద్రం 207 కోట్ల రూపాయలు

విడుదల చేసింది. ఈ నిధులు మహిళల ఆర్థిక అభివృద్ధికి, వారిని పారిశ్రామికవేత్తలుగా మార్చడానికి ఎంతో దోహదపడతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

---------------------------

సామాజిక మాధ్యమంలో వచ్చే వదంతులు నమ్మి ప్రజలెవ్వరూ పెట్రోల్, డీజిల్ స్టాకు పెట్టుకోవద్దని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి చెప్పారు. ప్రజల అవసరాల మేరకు డీజిల్, పెట్రోల్ నిల్వలు ఉన్నాయని మంత్రి తెలిపారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరా లభ్యత పై కేంద్ర మంత్రి ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులతో నిన్న హైదరాబాద్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ....

.. వాయిస్.. 25 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని కాకినాడ జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని, తగినంత ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయని కాకినాడ పార్లమెంట్ సభ్యులు ఉదయ శ్రీనివాస్ చెప్పారు. కాకినాడలోని పలు పెట్రోల్ బంకులను ఆయన అధికారులతో కలిసి నిన్న తనిఖీ చేసారు. ఇంధన కొరతకు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో వస్తున్న తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని ఆయన పౌరులను కోరారు. రైతులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని వివరిస్తూ శ్రీనివాస్ ..

..వాయిస్ 27 సెకన్లు

---------------------------

ప్రాణహిత చేవెళ్ళ ప్రాజెక్ట్‌లో భాగంగా తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా తుమ్మడి హెట్టి వద్ద నిర్మించే బ్యారేజి పనుల కార్యాచరణ వేగవంతం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ బ్యారేజి నిర్మాణం పూర్తయి ఆదిలాబాద్‌తో పాటు తెలంగాణలో మెట్ట ప్రాంతాల రైతులకు సాగు, తాగు నీటిని అందించవచ్చని, తక్కువ ఖర్చుతో గ్రావిటీపై శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్‌కు నీటిని తరలించేందుకు వీలుంటుందని ముఖ్యమంత్రి చెప్పారు. హైదరాబాద్ లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఆయన నిన్న తెలంగాణ నీటి పారుదల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి తో పాటు నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పదో తరగతి పరీక్షా ఫలితాలను విద్యాశాఖమంత్రి నారా లోకేష్ ఈరోజు ఉదయం విడుదల చేస్తారు. గతనెల 16వ తేదీ నుంచి ఏప్రిల్ 1 వరకు టెన్త్ పరీక్షలు జరగ్గా.. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 6 లక్షల 30 వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులు results.bse.ap.gov.in వెబ్‌సైట్‌లలో తమ హాల్‌టికెట్ నంబర్ ఎంటర్ చేసి నేరుగా ఫలితాలను పొందొచ్చు

కాగా తెలంగాణ పదో తరగతి ఫలితాలు నిన్న విడుదలయ్యాయి. ఈ ఏడాది 95.15 శాతం మంది విద్దార్థులు ఉత్తీర్ణత సాధించారు. ములుగు జిల్లా తెలంగాణా రాష్ట్రంలోనే అత్యధికంగా 99.30 శాతం ఉత్తీర్ణత సాధించగా హైదరాబాద్ 89.23 శాతంతో అట్టడుగు స్థానం పొందింది.

---------------------------

గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత, ఆరోగ్యకరమైన పద్ధతులను ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికతతో స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని ప్రారంభించారని ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు. గ్రామస్తులు పరిశుభ్రమైన అలవాట్లను అలవర్చుకునేలా ప్రోత్సహించడం, పారిశుధ్య ప్రమాణాలను మెరుగుపరచడం, తద్వారా మొత్తం గ్రామీణాభివృద్ధికి, ప్రజారోగ్య అవగాహనకు దోహదపడటం ఈ కార్యక్రమం లక్ష్యం అని ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం గోపవరంలో ఆయన నిన్న స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ...

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయని ఈరోజు, రేపు, ఇదే విధంగా ఉండే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ఎండతీవ్రత, మరికొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన అకాల వర్షాల కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మరో వైపు ....తెలంగాణలో రాగల నాలుగు రోజుల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది.

---------------------------

ఐపీఎల్ క్రికెట్‌లో భాగంగా ముంబైలోని వాంఖడే స్టేడియంలో గత రాత్రి ముంబై ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య జరిగిన మ్యాచ్ లో హైదరాబాద్ సన్ రైజర్స్ విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ముంబై ఇండియన్స్ 5 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేయగా... హైదరాబాద్ సన్ రైజర్స్ 18.4 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసి లీగ్‌లో వరుసగా ఐదో విజయాన్ని నమోదు చేసింది.

---------------------------

ప్రముఖ తెలుగు విప్లవ కవి, రచయిత శ్రీశ్రీగా సుపరిచితులైన శ్రీరంగం శ్రీనివాసరావు జయంతి ఈరోజు. తెలుగు సాహిత్యపు దశ–దిశను మార్చిన "మహా ప్రస్థానం", "జగన్నాథరథ చక్రాలు", "గర్జించు రష్యా" వంటి కవితా సంకలనాలు రచించిన శ్రీశ్రీ 1910 ఏప్రిల్ 30వ తేదీన విశాఖ జిల్లా పాండ్రంగిలో జన్మించారు. ఆయన ఆకాశవాణిలోనూ పనిచేశారు. శ్రీశ్రీ కవిగానే కాకుండా మాటలు, పాటల రచయితగానూ ప్రసిద్ధి పొందారు. అల్లూరి సీతారామరాజు చిత్రంలోని 'తెలుగు వీర లేవరా' గీతానికి శ్రీశ్రీ జాతీయ స్థాయి పురస్కారాన్ని అందుకున్నారు. 19వ శతాబ్దం నాదంటూ ఎలుగెత్తి చాటిన మహాకవి శ్రీశ్రీ 1983 జూన్ 15న అస్తమించారు.

======================